

న్యూస్ బాక్స్

బండి సంజయ్‌ని దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్‌ను సోషల్ మీడియాలో అసభ్యపదజాలంతో దూషించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌ను గురువారం కలిసి సోషల్ మీడియాలో కేంద్ర మంత్రి అసభ్యపదజాలంతో దూషించిన హరీష్ రెడ్డి అనేవ్యక్తిపై క్రిమినల్ కేసును నమోదు చేసి కఠినచర్యలను తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్)ఎల్లారెడ్డిపేట మండల కార్యవర్గాన్ని జిల్లా కార్యదర్శి శివకుమార్ అధ్యక్షతన గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోటగిరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా తుమ్మనపల్లి నరేశ్, ఉపాధ్యక్షుడిగా పసుల సత్తయ్య ఎన్నికయ్యారు. మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా సుతారి పద్మ, కోశాధికారిగా అలువాల నవ్యను ఎన్నుకున్నారు.

ఎల్ఆర్ఎస్‌లో వేగం పెరిగేనా..?



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా (ఫైల్)

- పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో కదలిక
- దరఖాస్తుల క్లియరెన్స్‌కు కలెక్టర్ ఆదేశాలు
- జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 42,942
- ఇప్పటివరకు పరిష్కరించినవి 10,492 దరఖాస్తులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అనుమతి లేని ప్లాట్లు, లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నా క్రమంలో అధికార యంత్రాంగం మరోసారి వేగవంతం చేశారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీంలోని దరఖాస్తులను మూడు నెలల్లో పరిష్కరించాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ అక్టోబరు 31 లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో దరఖాస్తుల పరిష్కారం కోసం అధికారులు ఎల్అర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేశారు.

రెండు రోజుల క్రితం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలతో పాటు గ్రామపంచాయతీల్లో ఉన్న పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. వేగవంతం చేసే దిశగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతం అవుతుందని భావిస్తున్నారు. దరఖాస్తుల పరిశీలనకు అదనంగా మళ్లీ బృందాలను ఏర్పాటు చేశారు. వెయ్యి దరఖాస్తులకు ఒక బృందాన్ని నియమించారు. నాలుగేళ్లకు పైగా నిరీక్షిస్తున్నా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ఊరట కలుగు తుందని భావిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు మున్సిపాలిటీలు, 255 గ్రామ పంచాయతీలు ఉండగా 42,942 దరఖాస్తులు ఎల్ఆర్ఎస్‌లో వచ్చాయి. జిల్లాలో ఎల్ఆర్ఎస్ ద్వారా వంద కోట్ల రూపాయలకు పైగా ఆదాయం లభించనుంది. దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 10,497 దరఖాస్తులను పరిశీలన పూర్తి చేశారు. 99మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారు.

● 32, 445 దరఖాస్తులు పెండింగ్

జిల్లా వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు వచ్చిన 42,942 దరఖాస్తుల్లో 10,497 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. ఇంకా 32,445 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సిరిసిల్ల మున్సిపాలిటీలో 10,493 దరఖాస్తులు రాగా 4,643 దరఖాస్తులు పరిష్కరించారు. 5,850 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో 16,336 దరఖాస్తులు రాగా 12,162 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 4,174 దరఖాస్తులు పరిష్కరించారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా 12,356 ...

మిగతా 8వ పేజీలో...

స్వచ్ఛతవైపు అడుగులు..

ఇంటర్వ్యూ

- పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- నిర్వాహణ భారంగానే ఉంది
- కుక్కల నియంత్రణకు చర్యలు
- మీర్జా ఫసహాత్ అలీబేగ్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్


మీర్జా ఫసహాత్ అలీభేగ్ కమిషనర్, సిరిసిల్ల మున్సిపల్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సిరిసిల్ల పట్టణంలో స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నామని గతంలో జాతీయస్థాయిలో అవార్డులు అందుకున్నామని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహాత్ అలీబేగ్ తెలిపారు. వస్తున్న ఆదాయం మేరకు నిర్వహణ భారంగానే ఉందని తెలిపారు. పారిశుధ్యలోపం తన దృష్టికి వచ్చిందని ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఆంధ్రజ్యోతి : సిరిసిల్లలో పారిశుధ్య లోపం ఉందనే విమర్శలపై స్పందన ఏమిటి?

కమిషనర్ : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో వినాయకచవితి, బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా కొంత పారిశుధ్య లోపం ఏర్పడినట్లు తన దృష్టికి వచ్చింది. పారిశుధ్య లోపం లేకుండా స్వచ్ఛత వైపు అడుగులు వేసే దిశగా చర్యలు చేపట్టాం. సిబ్బందికి కావాల్సిన బట్టలు, సామగ్రిని అందించాం. ఇంటింటికి చెత్త సేకరణకు వాహనాలు పంపిస్తున్నాం. స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుతాం.

ఆంధ్రజ్యోతి : మున్సిపల్ పన్నుల వసూళ్లు ఎలా జరుగుతున్నాయి..

కమిషనర్ : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్నుల వసూళ్లతో ప్రత్యేక దృష్టి పెట్టాం బృందాలను ఏర్పాటు చేసి వసూళ్లు చేస్తున్నాం. ఇప్పటికే 48 శాతం పన్నుల వసూళ్లు పూర్తయింది. పన్నుల వసూళ్లలో రాష్ట్రంలో సిరిసిల్ల ప్రతీ సంవత్సరం ముందు వరుసలో ఉంటుంది. ఇప్పటి వరకు 23,431 ఇళ్లకు సంబంధించి రూ 6.04 కోట్ల లక్ష్యానికి రూ 2.81 కోట్లు వసూలు చేశాం. రూ 3.22 కోట్లు గడువులోగా వసూలు చేసే దిశగా దృష్టి పెట్టాం.

మిగతా 8వ పేజీలో...

అమరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- ఎస్పీ అఖిల్ మహాజన్
- విద్యార్థులకు ఆయుధాల వినియోగంపై అవగాహన


విద్యార్థులకు ఆయుధాలపై వివరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

8

మా భర్తలతో వెట్టి చాకరి చేయిస్తున్నారు

- రాస్తారోకో చేసిన బెటాలియన్ పోలీస్ కానిస్టేబుల్స్ కుటుంబసభ్యులు


సిరిసిల్లలో ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

7

మాలల సమస్యలను పరిష్కరించాలి

ముస్తాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మాల సామాజిక వర్గ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మాల మహానా డు జిల్లా అధ్యక్షుడు తుంగ శివరాజం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమాకమైన ఏఎంసీ చైర్మన్ తలారి రాణినర్సింలు, ఏఎంసీ డైరెక్టర్ క్యారం రాజును సన్మానించారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు జంగ భూమరాజం, నాయకులు జక్కుల యాదగిరి, యారటి కరుణాక ర్, కృష్ణ, రమేశ్, రాజు, బిల్లం స్వామి, శంకర్ పాల్గొన్నారు.


మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న మాలమహానాడు నాయకులు

వరి వంగడాలపై రైతులకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త

ఇల్లంతకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నూతన వరివంగడాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు మండలంలోని పొత్తూరు గ్రామంలో గురువారం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ మదన్‌మోహన్ మాట్లాడుతూ చిరుసంచి దశలో ఉన్న వరి వంగడాలను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పరిశోధన స్థానాల్లో రూపొందించారని తెలిపారు. జిల్లాలోని బద్దెనపల్లి, వేములవాడ, నాగయ్యపల్లి గ్రామాల్లో కూడా చిరుసంచి దశలో ఉన్న వరి రకాలను సాగుచేస్తున్నారని తెలిపారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎరువులను విచక్షణ రహితంగా వాడరాదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు సతీష్‌చంద్ర, శ్రీధర్‌సిద్ధి, శ్రీనివాస్, గోన్యనాయక్, మధూకర్, విజయభాస్కర్, రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడి, ఏఈవో లలిత, రైతులు పాల్గొన్నారు.

సెస్ వార్షిక ఆదాయంపై నేడు బహిరంగ విచారణ

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం వార్షిక ఆదాయంపై శుక్రవారం విద్యుత్ వినియోగదారులతో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి అధ్వర్యంలో బహిరంగ విచారణ చేపట్టడం జరుగుతుందని ఎండీ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం యొక్క రిటేయిల్ సరఫరా వ్యాపార ఐదో నియంత్రణ కాల ఆర్థిక సంవత్సరం 2024- 25 నుంచి 2028-29 వరకు, ఆర్థిక సంవత్సరం యొక్క 2024-25 అదాయ అవశ్యకత, విద్యుత్ ఛార్జీల నుంచి అంచనా అదాయం అమోదం కోసం పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండలంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి జరిగే ఈ బహిరంగ విచారణకు సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. జిల్లాలో వినియోగదా రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెస్ ఎండీ కోరారు.

సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి


మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో చర్చిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి గురువారం నాడు హైదరాబాద్‌లోని సచివాలయంలో గల తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వేములవాడ నియోజకవర్గ పరిధిలోని పలు సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతి పై అధికారులతో చర్చించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజ్ టూ ఫేస్ వన్ పనులు వేగవంతం చేయాలని, మర్రిపల్లి రిజర్వాయర్, కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ పనుల్లో వేగవంతం చేయాలని మంత్రి అధికారులకు, సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఇటీవల బడ్జెట్‌లో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 325 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. రుద్రంగి, నాగారం చెరువు కాల్వపై రైతుల సౌకర్యార్థం బ్రిడ్జిల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలన్నారు. కోనరావుపేట మండలంలోని లచ్చంపేట చెరువును రిజర్వాయర్‌గా మార్చే ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. స్టేజ్ టూ ఫేస్ టూలో భాగంగా కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ కుడి ఎడమ కాల్వలకు సంబంధించి భూ సేకరణ వెంటనే చేపట్టి కాలువ పనులను ప్రారంభించవలసిందిగా ఆదేశించారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి ఎగువ మానేరు ప్యాకేజ్-9 పనుల్లో వేగవంతం చేయాలని, మల్కపేట రిజర్వాయర్‌లో రైతులకు సరిపడా నీటిని నింపాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు సాగునీటి ప్రాజెక్టులను సందర్శించి పనుల్లో పురోగతిని తెలుసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా వేములవాడ నియోజకవర్గం లోని పలు ప్రాజెక్టులను త్వరలో సందర్శిస్తానని నీటిపారుదల శాఖ మంత్రి వెల్లడించారు.

హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుమీద అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. అబద్దాల పునాదుల మీద రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన సాగుతోందన్నారు. రైతులకు రుణమాఫీ చేశామని చెపుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ తన స్వగ్రామంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. ఆర్భాటంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, ఫొటోలకు పోజులు ఇస్తున్నారే తప్ప ఎక్కడా ధాన్యాన్ని తూకం వేయడం ప్రారంభించలేదని విమర్శించారు. ప్రభుత్వంపై నమ్మకం లేకనే రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్ముకుంటున్నారని అన్నారు. ఎమ్మెల్యేకు రైతుల సమస్యలు పరిష్కరించాలనే ఆలోచన లేదన్నారు. తొలుత వివిధ గ్రామాలలోని కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, ప్యాక్స్ వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ హుండీల లెక్కింపు

- 30 రోజులకు రూ. కోటి 46 లక్షల ఆదాయం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీలను లెక్కించగా 30 రోజులకు గాను రూ. ఒక కోటి 46 లక్షల 16 వేల 253 నగదు సమకూరింది. 211 గ్రాములు బంగారం, 9 కిలోల 900 గ్రాముల వెండి రాజన్న ఆలయ ఖజానాకు సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. హుండీ లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ ఏఈవో, సూపరింటెండెంట్‌లు, ఆలయ సిబ్బంది. ఎస్పీఎఫ్ సిబ్బంది, శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.


హుండీ కౌంటింగ్‌లో పాల్గొన్న సిబ్బంది

క్రైం కార్నర్

వాహన తనిఖీల్లో గంజాయి పట్టివేత

గంగాధర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీల్లో కిలో 70 గ్రాముల గంజాయిని పట్టుకున్నామని చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. గంగాధరలో బుధవారం అర్ధరాత్రి ఎస్సై నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో యాసిన్, కొత్తపల్లి ఆదిత్య, వాజోదిపాషా అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని ప్రశ్నించగా గంజాయి అమ్ముతున్నామని తెలిపారు. తనిఖీ చేయగా కిలో 70 గ్రాముల గంజాయి పట్టుబడింది. వీరు నాగపూర్ నుంచి కొనుగోలు చేసి తాము తాగుతూ మండలంలోని చుట్టు పక్కల గ్రామాల్లోని యువత, కార్మికులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. పట్టుబడిన గంజాయి విలువ 26, 170 రూపాయలు ఉంటుందని, ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. గంజాయిపై ఉన్నతాధికారుల సూచన మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులు వేర్వేరు చోట్ల ఆత్మహత్యకు పాల్పడ్డారు. భూమి విషయంలో మనస్తాపం చెంది ఒకరు, అప్పుల ఒత్తిడి భరించలేక ఒకరు, ఇష్టం లేని పెళ్లి చేశారని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు.


నర్సయ్య(ఫైల్)

కోల్‌సిటీ, అక్టోబరు 24: గోదావరిఖనికి చెందిన సింగరేణి కార్మికులు మాలంశెట్టి నర్సయ్య(49) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరీంనగర్‌లో కొందరు బ్రోకర్లు నమ్మించడంతో రూ.80లక్షలు అప్పు చేసి భూమిని కొనుగోలు చేశాడు. తరువాత ఆ స్థలం వివాదంలో ఉందని తెలియడంతో పలుమార్లు సెటిల్‌మెంట్లకు ప్రయత్నించాడు. రెండు రోజుల క్రితం కరీంనగర్‌కు వెళ్లి సెటిల్‌మెంట్ కోసం చర్చలు జరిపాడు. అతడితో భూమి కొనుగోలు చేయించిన సర్వ శ్రీనివాస్ అనే వ్యక్తి సహకరిం చకపోగా, ఎదుటి వారి పక్షాన మాట్లాడినట్టు నర్సయ్య మదనపడ్డాడు. బుధవారం తెల్లవారు జామున ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గోదావరిఖని విఠల్‌నగర్ పోస్టాఫీస్ వద్ద సింగరేణి క్వార్టర్లలో నర్సయ్య నివాసముండేవాడు. అత డికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు గతంలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్న కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అప్పుల ఒత్తిడితో బెహరాన్‌లో వేంపేట వాసి..


సుధీర్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన యువకుడుఅప్పుల ఒత్తిళ్ల నేపథ్యంలో బెహరాన్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వేంపేటకు చెందిన మారంపల్లి సుధీర్ (35)కు భార్య ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. జీవనోపాధి కోసం రెండున్నరేళ్ల క్రితం సుధీర్ బెహరన్ వెళ్లాడు. కుటుంబ పోషణ కోసం తీసుకున్న అప్పులు ఇచ్చిన వారి ఒత్తిళ్లు ఎక్కువ య్యాయి. దీంతో బెహరాన్‌లో నివా సం ఉం టున్న తన గదిలోనే బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు స్నేహి తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సుధీర్ మృతి చెంది ఉన్న ఫొటోలు చూసి ఆయన మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుధీర్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గ్రామస్థులు కోరారు.

ఇష్టం లేని పెళ్లి చేశారని యువకుడు..

గంగాధర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం నారాయణపూర్‌కు చెందిన యువకుడు ఇష్టంలేని పెళ్లి చేశారని బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చింతలతాడేపు మహేష్(29)కు ఆరు నెలల క్రితం వివాహం జరిగింది. కాగా తనకు ఇష్టలేని వివాహం చేశారని మనస్తాపంతో బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహేష్ తల్లి దేవవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సైబర్ వలలో జిల్లా యువత

- ఉపాధి కోసం లావోస్ వెళ్లి తిరిగి రాక
- ఏజెంట్ మోసంపై ఎస్పీకి ఫిర్యాదు


ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బాధితులు

రాయికల్/ జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి కరువై ఇతర దేశాల్లో ఉపాధి కోసం వెళ్తే ఏజెంట్ల మాయ మాటలకు నిరుద్యోగ యువత మోసాలకు గురవుతున్నారు. తాజాగా జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు యువకులు సైబర్ వలలో చిక్కు కుండా తిరిగి స్వదేశానికి వచ్చిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం రాయికల్ మండలం తాట్లవాయికి చెందిన చెట్లపల్లి మహేష్, గాండ్ల అనిల్ కుమార్, అల్లీపూర్‌కు చెందిన చెలుముల ప్రవీణ్, జగిత్యాలకు చెందిన అయ్యోరి మోహన్ రాయికల్ మండలానికి చెందిన ఓ ఏజెంట్ ద్వారా ఉపాధి కోసం లావోస్ వెళ్లడానికి ఒక్కొక్కరు రూ.1.50 లక్షలు చెల్లించారు. సెప్టెంబరు 30న నలుగురిని బ్యాంకాక్ తీసుకువెళ్లి అక్కడి నుంచి వాహనాల్లో లావోస్ తీసుకువెళ్లారు. అక్కడ డాటా ఎంట్రీ ఉద్యోగం అని చెప్పి నగరానికి దూరంగా ఉంచి శిక్షణ పేరుతో భారతదేశంలోని వ్యక్తుల నుంచి సైబర్ మోసాలు చేయడానికి మెళకువలు నేర్పిస్తున్నారు. గమనించిన యువకులు సైబర్ నేరాలు తాము చేయమని అక్కడి తెలుగు వారి సహాయంతో యువత అక్కడి నుంచి తప్పించుకుని తిరిగి స్వదేశానికి వచ్చారు. వచ్చిన అనంతరం ఏజెంట్‌ను కలిసి తమను మోసం చేశావని, తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా ఏజెంట్ పట్టించుకోకపోవడంతో బాధితులు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ఆలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వీపర్‌గా విధులు నిర్వహించే బక్కయ్య అనే ఉద్యోగి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రసాద కౌంటర్ వద్ద విధులు నిర్వహించే బక్కయ్యకు ఏళ్ల తరబడిగా కొండపైన నివాసముంటున్న ఓ భక్తురాలికి మధ్య నెల రోజుల క్రితం అల్పాహారం విషయమై వివాదం ఏర్పడడంతో బక్కయ్య దేవస్థానం అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందుకు దేవస్థానం ఉద్యోగి ఒకరు భక్తురాలికి మద్దతు పలుకుతున్నారని ఆరోపించగా కొద్ది రోజుల తరువాత ఈ విషయం సద్దుమనిగింది. మళ్లీ రెండు రోజుల క్రితం ఆ భక్తురాలు ప్రసాద కౌంటర్ వద్దకు రావడంతో కౌంటర్‌లో విధులు నిర్వహించే మరో ఉద్యోగి, బక్కయ్యకు భక్తురాలి విషయమై మళ్లీ వాగ్వాదం చోటుచేసుకుంది. కాగ బక్కయ్య అదే రోజు క్రిమిసంహారక మందు తాగడంతో చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ తీసుకెళ్లారు. ప్రస్తుతం కోలుకుంటున్నట్లు ఆలయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ విషయం కొండపైన చర్చనీయంశంగా మారింది. ఏళ్ల తరబడి తిష్ట వేసిన భక్తులతో ఆలయ ఉద్యోగుల్లో గొడవలు జరుగుతున్నట్లు పలువురు చెబుతున్నారు.

వావ్..వర్షిణి..

డ్యాన్సర్, గాయని, నటిగా రాణిస్తున్న 'ఖని' యువతి

ట్రెండింగ్



చిన్ననాటి నుంచి ఆమెకు డ్యాన్సంటే ప్రాణం... ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తోడైంది.. సెకండ్ క్లాస్‌లో స్టేజీపై మొదలైన స్టెప్పులే... నేడు డ్యాన్సర్‌గా తన సత్తాను చాటుకుంటోంది. అంతేకాకుండా గాయనిగా... నటిగా... డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా రాణిస్తున్నది... ఆమె చేసే డ్యాన్స్ పాటకు ప్రాణం పోస్తుంది... వీక్షకులను హుషారెత్తిస్తుంది... తన టాలెంట్‌కు యూట్యూబ్‌లో లక్షల వ్యూస్‌తో దూసుకెళుతోంది. బుల్లితెరపై పలు షోలతో పాటు దేశవిదేశాల్లో ఎన్నో ప్రదర్శనలిస్తూ అందరి ప్రశంసలందుకుంటోంది గోదావరిఖని 'మహానటి'గా గుర్తింపు తెచ్చుకున్నది వరుమణి వర్షిణి..

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన వరుమణి వర్షిణి డ్యాన్సర్‌గా, గాయనిగా, నటిగా రాణిస్తూ అందరి ప్రశంసలందుకున్నది. ఫోటో తీస్తున్నడే సీమ దసరా చిన్నోడు అంటూ సాగే పాటలో అదిరిపోయే స్టెప్పులతో వీక్షకులను ఉర్రూతలూగించింది వర్షిణి. ఈ పాటకు యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్ వచ్చాయి.

వర్షిణి ప్రస్తానం..:

డ్యాన్స్ ప్రదర్శనలిస్తూనే 2021లో రీల్స్ చేయడంతో పాటు యూట్యూబ్‌లో వివిధ ప్రైవేట్ ఆల్బమ్స్‌లో నటించింది. వర్షిణి నటించిన ఖద్దరు చొక్కా, నాయిదోరో..చిన్నదోర, ఫోటో తీస్తున్నాడే సీమ దసరా చిన్నోడు పాటలు విశేషంగా ఆదరణ పొందాయి. యూట్యూబ్‌లో తన పాటలతో మిలియన్‌లలో వ్యూస్ రావడంతో గత సంవత్సరం ఆమెకు జబర్దస్త్ టీవీ షోలో నటించే అవకాశం వచ్చింది. అలాగే శ్రీదేవి డ్రామా కంపెనీ షోలో పలు ప్రదర్శనలు ఇస్తూ విశేష ఆదరణ పొందుతున్నది. అంతేకాకుండా త్వరలో విడుదల కానున్న ఓ చిత్రంలో హీరోయిన్ పాత్రకు డబ్బింగ్, మరో రెండు సినిమాలలో సైడ్ క్యారెక్టర్‌గా నటిం చింది. ప్రస్తుతం తెలుగు, తమిళ్, కన్న డం మూడు భాషాల్లో చిత్రీకరిస్తున్న చిత్రంలో వర్షిణి నటిస్తున్నది.

నటిగా.. ఉపాధ్యాయురాలిగా సేవలందించాలి..

వరుమణి వర్షిణి

మా అమ్మానాన్నలు వేణుమాధవ్, వాణి ప్రైవేట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం టీవీ షోలతో పాటు తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల్లో నటిస్తున్నాను. మంచి నటిగా రాణిస్తూ గుర్తింపు పొందడంతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలన్నది నా లక్ష్యం.



టీవీ షోలో నటి ఇంద్రజతో డాన్స్ చేస్తున్న వర్షిణి, టీవీ షోలో వ్యాఖ్యాతగా...


సాంగ్ షూటింగ్‌లో..

కేర్‌టేకర్‌గా వచ్చి చోరీ

జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేర్‌టేకర్‌గా వచ్చి ఇంట్లో వారితో నమ్మకంగా మెదిలిన ఓ వ్యక్తి ఆ ఇంటికే కన్నం వేశాడు. జిల్లా కేంద్రంలోని టీట్ బజార్ ప్రాంతానికి చెందిన కోటగిరి శ్రీనివాస్ తన తండ్రి చంద్రశేఖర్‌కు సర్జరీ కావడంతో కేర్‌టేకర్ కోసం హైదరాబాద్‌లోని వశిష్ఠ హోం కేర్ సర్వీసెస్‌ను సంప్రదించాడు. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం దొంతమూరు గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి రాజు అనే వ్యక్తిని నెలకు రూ. 22 వేల వేతనంతో కేర్‌టేకర్‌గా శ్రీనివాస్ ఇంట్లో నియమించింది. మూడు నెలల పాటు నమ్మకంగా పనిచేసిన రాజు 20 రోజుల క్రితం స్వగ్రామం వెళ్లాడు. బుధవారం జగిత్యాలకు వచ్చి శ్రీనివాస్ ఇంట్లో తిరిగి పనిచేస్తానంటూ నమ్మించాడు. రాత్రి సమయంలో బీరువాలో ఉన్న రూ. 99,500 నగదును అపహరించుకవెళ్లాడు. ఇంట్లో ఉండాల్సిన రాజు కనబడకపోవడంతో సీసీ పుటే జీల ద్వారా చోరికి పాల్పడ్డట్లు గుర్తించారు. జరిగిన సంఘటనపై బాధితుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆసుపత్రిలో చోరీ...

జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న సాయినీస్ డెంటల్ కేర్ ఆసుపత్రిలో బుధవారం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆసుపత్రి కిటికీలు పగులగొట్టి రూ. 55 వేల విలువగల ఐఫోన్‌తో పాటు విలువైన వస్తువులు అపహరించుకవెళ్లారు. అభిషేక్ రాజ్ ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్యజ్యోతి): తలకు గాయాలతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కరీంనగర్ మారుతినగర్‌కు చెందిన ఎండీ అక్బర్ ఖాన్(44) గురువారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ మూడో టౌన్ పోలీసులు తెలిపారు. అక్బర్ ఖాన్ పెయింటర్‌గా పనిచేస్తుం డేవాడని, ఇటీవల మద్యం సేవించి పడిపో తుండేవాడని కుటుంబ సభ్యులు పోలీసు లకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 15 రోజుల కిందట తలకు గాయం కాగా మళ్లీ ఈ నెల 21న కిందపడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లగా కరీంనగర్ ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స అందించినట్లు తెలిపారు. అనంతరం ఎంజీఎంకు తరలించి వైద్యం అందిస్తుండగా మృతి చెందాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

దైవారాధనతోనే సత్ఫలితాలు

నైమిశారణ్య పీఠాధిపతి పూజలు


స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో శ్రీనివాస్

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దైవారాధన ద్వారానే సత్ఫలితాలు సాధ్యమవుతాయని నైమిశారణ్య పీఠాధిపతులు బాల బ్రహ్మ నంద సరస్వతి స్వామి అన్నారు. ప్రతి వ్యక్తి భగవంతుడిని నిత్యం పూజించాలని తెలిపారు. ధర్మపురి క్షేత్రంలో స్వామి గురువారం ఉదయం ప్రవచనాలు చేశారు. లక్ష్మీ నరసింహ స్వామి వారి లీలా విలాసనం గురించి ప్రవచనాలు చేశారు. అంతకు ముందు స్వామి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయం వద్ద పీఠాధిపతులకు అధికారులు, వేదపండితులు, అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించారు. అంతకు ముందు ఆయన యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీ పంలో నూనె పోశారు. ఆయన వెంట ఆలయ ఈవో సంక టాల శ్రీనివాస్, వేదపండితులు పాల్గొన్నారు.

యాపిల్‌ఫోన్ నకిలీ విడిభాగాల అమ్మకాలు

- 4 మొబైల్ షాపులపై కేసులు నమోదు


మొబైల్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రాజన్న

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో యాపిల్ మొబైల్‌ఫోన్ బ్రాండ్‌తో షాపుల్లో వినియోగ దారులకు విక్రయిస్తున్న నకిలీ మొబైల్ విడిభాగాలు, అనుబంధ పరికరాలు పట్టుబడ్డాయి. యాపిల్‌ఫోన్‌కు అనుబంధమైన పవర్ ఎడాప్టర్, ఇయర్‌బర్డ్స్, లైటింగ్ కేబుల్, బ్యాక్ కవర్లు బ్రాండెడ్‌గా చూపుతూ వ్యాపారులు విక్రయిస్తున్నట్లు ఆపిల్‌ఫోన్ కంపెనీ ఫిర్యాదుతో కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ ఆధ్వర్యంలో షాపులలో తనిఖీలు నిర్వహించగా పలు రకాల నకిలీ పరికరాలు పట్టుబడ్డాయి. యాపిల్ ఫోన్ కంపెనీకి సంబంధించిన పేరుతో నకిలీ పరికరాలు, విడిభాగాలు విక్రయిస్తున్న అన్నపూర్ణ కాంప్లెక్స్‌లోని పంచరతన్ మార్కెటింగ్‌షాపు, శ్రీజ మొబైల్ స్పేర్‌పార్ట్స్, మహాలక్ష్మి సెల్ వరల్డ్, చాముండా మొబైల్ షాపుల యజమానులపై కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు. నకిలీ విడిభాగాలు, పరికరాలను సీజ్ చేశామనిని, అక్రమాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం రెండో బైపాస్ రోడ్డు చంద్రంపేట చౌరస్తా వద్ద గురువారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదు రుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఇదే సమ యంలో పెట్రోలింగ్ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. బైపాస్ రోడ్డులోని చంద్రంపేట చౌరస్తా వద్ద చీకటిగా ఉండడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

ఉపకార వేతనం.. భవితకు ఊతం..

పేద విద్యార్థులకు వరంగా ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్

సమాచారం



చదువుకోవాలనే తపన ఉన్న విద్యార్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు విధాలుగా ప్రోత్సహిస్తున్నాయి. చదువులో ప్రతిభ ఉన్న విద్యార్థుల కోసం ఉపకార వేతనాలు అందిస్తున్నాయి. అటువంటిదే కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్‌ఎంఎంఎస్). ఈ ఉపకార వేతనాన్ని జాతీయ స్థాయిలో పరీక్ష నిర్వహించి అందజేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. అర్హత సాధించిన విద్యార్థులు తొమ్మిదో తరగతి నుంచి ఐదు సంవత్సరాలపాటు 12 వేల రూపాయల చొప్పున స్కాలర్‌షిప్ పొందవచ్చు.

హుజూరాబాద్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చదుకోవాలనే తపన ఉన్నా.. ఆర్థిక స్థోమత లేక ఎంతోమంది విద్యార్థులు తమ చదవులను అర్థంతరంగా ఆపేసిన సంఘటనలు ఉన్నాయి. ఈ తరుణంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఊతం అందిస్తోంది. వీటిని అందిపు చ్చుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తూ.. ముందు కు సాగుతున్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాలు (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం - ఎన్‌ఎంఎంఎస్) అందిస్తోంది.

నాలుగేళ్లపాటు ఉపకారం అందుకుంటూ ఉన్నత చదువులు చదివే అవకాశముంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయస్థాయిలో పరీక్ష ఉంటుంది. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏటా 12 వేల రూపాయల చొప్పున తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం వరకు ఐదేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. నవంబరు 24న పరీక్ష నిర్వహిస్తారు.

పరీక్ష స్వరూపం

పరీక్షలో మొత్తం 180 మార్కులకు రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్-1 మానసిక సామర్థ్య పరీక్ష. ఇందులో 90 ప్రశ్నలకు 90 మార్కులుంటాయి. రీజనింగ్, ఎబిలిటీస్, సంఖ్యా శాస్త్రం, పదాల భిన్న పరీక్ష, నంబర్, అనాలజీ, అల్ఫాబెట్ అనాలజీ, కోడింగ్ డీకడింగ్, లాజికల్ ప్రశ్నలు, వెన్‌చిత్రాలు, మిర్రర్ ఇమేజెస్, వాటర్ ఇమేజెస్ అంశాల్లో ప్రశ్నలు ఉంటాయి. వీటిని సాధన చేయాలి. పార్ట్-2లో ఏడు, ఎనిమిదో తరగతి సిలబస్ నుంచి 90 ప్రశ్నలుంటాయి. 90 మార్కులుంటాయి. గణితం 20 మార్కులు, భౌతిక, రసాయన, జీవ శాస్త్రం కలిపి 35 మార్కులుంటాయి. పరీక్ష ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో మల్టిపుల్ చాయిస్ రూపంలో ఉంటుంది.

న్యూస్ బాక్స్

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు హృతికేశ్ ఎంపిక


పతకం అందుకుంటున్న హృతికేశ్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు జిల్లాకు చెందిన వంగల హృతికేశ్ ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభచాటి రజత పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ వేణుగోపాలక్ష తెలిపారు. ఈ సందర్భంగా హృతికేశ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ వై సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ బి మధుసూదన్‌రెడ్డి అభినందించారు.

28న జాబ్ మేళా

గణేశ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ టాస్క్(తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్‌సెంటర్) ఆధ్వర్యంలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కల్వకుంట రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. డిగ్రీ లేదా ఇంటర్ పాసైన వారు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. కనీస వయస్సు 28 సంవత్సరములు దాటకూడదని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భగ్గుమన్న విభేదాలు

- ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అనుచరుల పరస్పర దాడులు
- పలువురిపై కేసు నమోదు

జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచరుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. అనుచరుల మధ్య జరిగిన ఓ భూ వివాదంలో ఒకరిపై మరొకరు దాడి చేసుకోగా జగిత్యాల రూరల్ టౌన్‌లో కేసులు నమోదయ్యాయి. జగిత్యాల పట్టణంలోని ఒకటవ వార్డు కౌన్సిలర్ కూసరి అనీల్, జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన బండారి వెంకటరాజంలకు మధ్య తిప్పన్నపేట గ్రామ శివారులో ఉన్న భూముల విషయంలో కొన్ని రోజులుగా తగాదాలు నడుస్తున్నాయి. ఈనెల 18వ తేదీన శుక్రవారం ఇదే భూమి విషయంలో వెంకట రాజం, అనీల్‌కు మధ్య వివాదం ముదిరి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాలు జగిత్యాల రూరల్ పోలీసులకు అదే రోజు ఫిర్యాదు చేయగా పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. అయితే కౌన్సిలర్ కూసరి అనీల్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచరుడిగా గుర్తింపు ఉండగా, బండారి వెంకట్రాజం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మనిషి కావడంతో ఈఘటన జగిత్యాలలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మూడు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడు మారు గంగారెడ్డి హత్య సంచలనం సృష్టించింది. ఆయన హత్యకు భూ వివాదమే కారణమని భావిస్తున్నారు. ఈ ఘటన మరవకముందే మరో భూ వివాదం వెలుగులోకి రావడంతో చర్చనీయాంశంగా మారింది.

చిన్న కొడుకుకు తండ్రి భూమి పట్టా చేసే యత్నం

- అడ్డుకున్న మిగతా కొడుకులు


పురుగుల మందు డబ్బా తీసుకుంటున్న పోలీసులు

ఇల్లందకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు కొడుకులు ఉన్నప్పటికీ ఓ తండ్రి తన పేరిట ఉన్న 1.08గుంటల భూమిని గురువారం చిన్న కొడుకుకు పట్టా చేసే యత్నం చేయగా మిగతా ఇద్దరు కుమారులు పురుగుల మందు డబ్బా చేతిలో పట్టుకుని అడ్డుకున్న సంఘటన ఇల్లందకుంట తహసీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకుంది. ఇల్లందకుంట మండలంలోని శ్రీరాముల పల్లి గ్రామానికి చెందిన అంబరిగుంట రాము లుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇతడికి సర్వే నంబర్ 180లో 19.08ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో నుంచి ముగ్గురు కొడుకులకు 6ఎకరాల చొప్పున గతంలోనే వాటాలు పంచాడు. మిగితా 1.08గుంటల భూమి రాములు పేరిట ఉంది. ఆ భూమిని చిన్న కొడుకు అయిన తిరుపతికి పట్టా చేసేందుకు సేల్ డీడీతో గురువారం తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మిగితా ఇద్దరు కుమారులు శ్రీనివాస్, సంజీవరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి పురుగుల మందు డబ్బాలతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అందరికి సమానంగా రావాల్సిన భూమిని తమ్ముడు ఒక్కడికి చేయవద్దని తహసీల్దార్ రాణిని కోరారు. కొంతసేపు తండ్రి ముగ్గురు కొడుకులు ఘర్షణ పడ్డారు. తహసీల్దార్ రాణి రాములకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా చిన్న కొడుకు ఒప్పుకోలేదు. దీంతో తహసీల్దార్ పోలీస్‌లకు సమాచారం అందించారు. పోలీసులు రాములుతో పాటు కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తరలించారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

కోనరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలం లోని శివంగాలపల్లిలో పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే వారిని సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివంగాల పల్లి గ్రామానికి చెందిన బిజ్జం ధర్మయ్య, వాణి, అంజి, శ్రీకాంత్‌పై పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. వెంటనే గ్రామస్థులు పిచ్చి కుక్కను చెదరగొట్టి గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో..

- మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారుల సమావేశం
- సరిహద్దుల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు
- సమాచారం మార్పిడి చేసుకోవాలని నిర్ణయం



సమావేశానికి వెళుతున్న రామగుండం సీపీ, ఐజీ శ్రీనివాస్

కోల్‌సిటీ, అక్టోబరు 24: మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో మూడు రాష్ట్రాల సహరిహద్దు జిల్లాల పోలీస్ అధికారుల సమావేశం గురువారం గడ్చిరోలి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి రామగుండం పోలీస్ కమిషనర్, ఐజీ శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా రామగుండం నుంచి హెలికాప్టర్‌లో తీసుకెళ్లారు. శ్రీనివాస్ సమావేశానికి అధ్యక్షత వహించగా గడ్చిరోలి డీఐజీ అంకిత్ గోయల్, సీఆర్‌పీఎఫ్(ఆపరేషన్స్) డీఐజీ అజయ్ శర్మ, కనికెర్ ఎస్పీ కళ్యాణ్, ఎలెసెల, మోహాల మణిపూర్ ఎస్పీ వైపీ సింగ్, గడ్చిరోలి ఎస్పీ నిలోత్పల్, బాంద్ర ఎస్పీ నూరుల్ హసన్, చంద్రపూర్ ఎస్పీ ముమ్మక్క సుదర్శన్, గోండియా ఎస్పీ గోరక్ భమ్రే, భూపాల్‌పల్లి ఎస్పీ కిరణ్‌కారే, ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస్‌లు, నారాయణపూర్ అడిషనల్ ఎస్పీ రాబిన్‌సన్, బీజాపూర్ అడిషనల్ ఎస్పీ దినేష్ సిన్హా తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. మావోయిస్టు కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, పరస్పర సమాచారం మార్పిడి చేసుకోవాలని నిర్ణయించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు మూడు రాష్ట్రాల అధికారులు పరస్పర సహకారంతో మెదలాలని నిర్ణయించారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు జరుపాలని, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల సరిహద్దు ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. ఎస్‌బీడబ్ల్యూ విషయంలో ఇరు రాష్ట్రాల అధికారులు సమాచార మార్పిడి చేసుకోవాలని, ఒకరికొకరు సహకరించుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, గడ్చిరోలి ఎస్పీ(అడ్మిన్) రమేష్, ఆపరేషన్ డీఎస్పీ విశాల్‌నాగార్ గోగె, రామగుండం ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావుతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్‌కు చెందిన పలు జిల్లాల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులకు ఓరియంటేషన్ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌నకు హాజరైన ఐదు జిల్లాల అటవీశాఖ అధికారులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24: రాజన్న సిరిసిల్ల జోన్ పరిధిలోని ఐదు జిల్లాల అటవీశాఖ అధికారులకు కరీంనగర్ డీర్‌పార్క్‌లో గురువారం ఒక రోజు ఓరియంటేషన్ ట్రైనింగ్ నిర్వహించారు. అటవీ ప్రాంత అభివృద్ధికి చేపట్టాల్సిన పనుల ప్రణాళికను రూపొందించేందుకు ఈ ఒక రోజు శిక్షణ జరిగింది. 2025-26 నుంచి 2035-36 సంవత్సరం వరకు 10 ఏళ్లల్లో రాజన్నసిరిసిల్ల జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో మొక్కల పెంపకం, చెక్‌డ్యాంల నిర్మాణం, అటవీప్రాణుల సంరక్షణ, చెట్లు కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీప్రాంతాల్లో వివిధ రకాల సర్వే చేసేందుకు ఈ శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణకు అటవీశాఖ జియోమాటిక్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టం(జీఐఎస్) నుంచి ఐఎఫ్‌ఎస్ అధికారి ఐ ప్రకాశ్, కరీంనగర్ డీఎఫ్‌ఓ సీహెచ్ బాలమణి, మెదక్ డీఎఫ్‌ఓ ఎం జోజి, కామారెడ్డి ఎఫ్‌డీఓ రామకృష్ణలు పాల్గొన్నారు. ఈ శిక్షణలో కరీంనగర్. సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు చెందిన ఫారెస్టు రేంజి ఆఫీసర్లు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, ఇతర అధికారులు 100 వరకు హాజరయ్యారు. 10 ఏళ్ల ప్రణాళికలను రూపొందించేందుకు ఈ శిక్షణ నిర్వహించామని అధికారులు తెలిపారు.

ఎస్‌యూ కబడ్డీ పోటీల విజేత వివేకానంద జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ఈనెల 23న నిర్వహించిన ఉమ్మడి జిల్లా అంతర డిగ్రీ, పీజీ కళాశాలల కబడ్డీ టోర్నమెంట్‌లో వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొనగా, ఫైనల్‌లో ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల జట్టుపై వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జట్టు 28-19 పాయింట్ల తేడాతో విజయం సాధించినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పన్యాల శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జట్టును కళాశాల కరస్పాండెంట్ వి ఆగంరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ అభినందించారు.



మూడు కాలాలు ఆరు పంటలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయం అంటే వరి అనేలా పరస్థితి ఉండేది.. ఇప్పుడిప్పుడే ఈ పరిస్థితులు మారుతున్నాయి.. పలువురు రైతులు వినూత్న సాగు పద్ధతులు పాటించి లాభాలు గడిస్తున్నారు. చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన తాటికొండ కుమార్ ఇలాంటి పద్ధతులే పాటిస్తున్నాడు. తన తండ్రి నుంచి సంక్రమించిన మూడెకరాల భూమిని ఆరు విభాగాలు విభజించాడు. ఆ భాగాల్లో సీజన్‌కు అనుగుణంగా కూరగాయలు, పూల తోటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. ఈ ప్రాంతంలో ఎవ్వరూ వేయని బోడకాకరను పందిరి పద్ధ చేసి మంచి లాభాలు పొందాడు.



కాకరకాయ తోట



బీరకాయ తోట

- కొత్త పద్ధతుల్లో సాగు
- లాభాల పంట పండిస్తున్న యువ రైతు

చొప్పదండి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం రుక్మాపూర్‌కు చెందిన యువ రైతు తాటికొండ కుమార్ మూస పద్ధతి సాగును వదిలిపెట్టాడు. తన తండ్రి మూడు ఎకరాల భూమిలో వరి సాగు చేస్తుండేవాడు. తండ్రి లాగే వ్యవసాయం చేస్తే లాభం ఉండదని గ్రహించాడు కుమార్. వినూత్నంగా ఆలోచించాడు. ఉన్న మూడు ఎకరాల భూమిని 20 గుంటలకు ఒకటిగా ఆరు విభాగాలుగా విభజించాడు. ఆరు రకాల పంటలను ఎంచుకుని సాగు చేపట్టాడు. పందిరి సాగు కింద మల్చింగ్, డ్రిప్ పద్ధతిలో బోడకాకర, కాకర, బీర కాయ, అలసంద, బంతిపూల సాగును చేపట్టాడు. అధిక లాభాలను పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

భరోసా కల్పించిన బంతి పూల సాగు

రెండు రకాల బంతి పూల సాగును ఎకరం చేనులో మల్చింగ్ విధానంలో సాగు చేశాడు. దసరాకు కొంత భాగం పూలను కోసి విక్రయించగా మరి కొంత దీపావళికి అమ్మేందుకు ప్రణాళిక బద్దంగా పంట సాగు చేపట్టారు. అధిక దిగుబడితో బంతి సాగు లాభాల పంటగా మారింది.

బోడకాకర సాగుతో లాభల పంట

అతి తక్కువ మంది సాగు చేసే బోడకాకరను కుమార్ 20 గుంటల్లో నాటాడు. ఖర్చుతో కూడుకున్న బోడకాకర కాయ సాగును పందిరి సాగులో విధానంలో చేపట్టాడు. ఆయన కష్టానికి ఫలితం లభించి మంచి దిగుబడి వచ్చింది. తానే మార్కెట్‌కు తీసుకెళ్లి కిలోకు 200 రూపాయల చొప్పున అమ్మాడు. మంచి లాభాలు వచ్చాయి.

కూరగాయలకు డిమాండ్

పందిరి సాగు కింద కుమార్ బోడ కాకరతో పాటు కాకరకాయ, బీరకాయ సాగు చేపట్టాడు. ప్రస్తుతం ఈ మూడింటికి మార్కెట్‌లో మంచి ధర పలుకగా అలసంద కూడా మంచి దిగుబడి వచ్చింది. ధర కూడా కలిసి రావడంతో లాభాల పంట పండింది.

యాసంగిలోనూ కూరగాయల సాగు

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగు చేపడుతూ కుమార్ యాసంగిలో టమాటోతో పాటు ఇతర కూరగాయల సాగుకు సమాయత్తం అవుతున్నాడు. తక్కువ విస్తీర్ణంలో తక్కువ నీటితో అధిక లాభాలను ఇచ్చే పంటలను సాగు చేస్తూ లాభాలను గడుస్తున్న కుమార్ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.



బోడకాకర తోటలో రైతు కుమార్

న్యూస్ బాక్స్

1న కరీంనగర్‌కు బీసీ కమిషన్ బృందం రాక

సిరిసిల్ల అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్ల దమాషాను పేర్కొనే విషయంలో రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడానికి తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబరు 1న కరీంనగర్‌కు వస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు సంబంధించి నవంబరు 1న కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీ, బీసీ కమిషనర్ల బృందం అభిప్రాయ సేకరణ జరపనున్నట్లు తెలిపారు. అభిప్రాయాలు, సలహాలు, సూచనలు, తెలియజేయాలనుకున్న వారు రాతపూర్వకంగా అభ్యంతరాలను నేరుగా తెలియజేయవచ్చని తెలిపారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

భగత్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవ త్సరానికి గాను డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్స్ కోర్సు (2 ఇయర్స్ డిఎంఐటి), డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నీషియన్ కోర్సు (2 ఇయర్స్)లకు గాను ఇంటర్‌లో బైపీసీ చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బైపీసీ విద్యార్థులు లేనిచో ఎంపీసీ చదివిన వారి నుంచి కూడా దరఖాస్తులు తీసుకుంటా మన్నారు. పూర్తి వివరాలు కళాశాల వెబ్ సైట్‌లో చూసుకోవచ్చన్నారు. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సందేహాల నివృత్తికి కళాశాల వేళల్లో సంప్రదిస్తే సిబ్బంది వివరాలు తెలియజేస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

మా భర్తలతో వెట్టి చాకిరి

- రాస్తారోకో చేసిన బెటాలియన్ పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు



సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో బైఠాయించిన పోలీస్‌ల కుటుంబీకులు

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పేరుతో బెటాలియన్‌లో కూలీలుగా మార్చి వెట్టిచాకిరి చేయిస్తున్నారని వారి భార్యలతోపాటు కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం సిరిసిల్ల 17వ పోలీస్ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబీకులు ప్లకార్డుల తో భర్తల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి న్యాయం చేయాలంటూ నిరసన తెలిపేందుకు వచ్చారు. అక్కడే మోహరించిన సిరిసిల్ల పోలీసులు అడ్డుకుని ప్లకార్డులను తీసుకున్నారు. దీంతో ఆగ్రహించిన వారందరూ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగానికి తమ భర్తలు చేస్తున్న పనికి సంబంధం లేకుండా పోయిందన్నారు. పోలీస్ ఉద్యోగం పేరుతో బెటాలియన్‌లో కూలీ పనులు చేస్తున్నారని ఈ విషయాన్ని ఎవరికైనా చెప్పుకోవడానికి నామూషిగా ఉందన్నారు. తమ భర్తలకు ఎనలేని డ్యూటీలు వేసి కుటుంబంతో గడపకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ పాలన లేకుండా డ్యూటీలను పోలీస్ అధికారులు వేయడం వలన తమ భర్తలు డ్యూటీ చేయాలంటే భయంతో వణికిపోతున్నారన్నారు. శుభకార్యాలు జరుపుకోవడానికి సెలవులను ఇవ్వకుండా అధికారులు వేధింపులకు గురిచే స్తున్నారని.. ఒకవేళ సెలవు తీసుకోవాలంటూ అధికారులకు లంచాలను ఇవ్వాల్సిందేనని అన్నారు. బెటాలియన్‌లో పనిచేసే వారు చనిపోతే కానిస్టేబుళ్లు అంత్యక్రియలు చేయాలని వాళ్లే డప్పుళ్లు కొట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అమలుచేస్తున్న పోలీస్ విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసి తమ భర్తలకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ సీఐ మొగిలి అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి ఆందోళనలు చేయవద్దని చెప్పినా ఎవరు వినిపించుకోకపోవడంతో వారిని పోలీసులు బలవంతంగా పోలీస్ వాహనంలో ఎక్కించి సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌కు తరలించారు. అక్కడి బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావుతో సమావేశాన్ని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని బెటాలియన్‌లలో అమలు చేస్తున్న వాటిని ఇక్కడ కూడా అమలు చేసి విధులను అప్పగించడం జరుగుతుందని అన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలను అందిస్తామని తెలిపారు.

మహిళ అదృశ్యం

గంభీరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేట గ్రామానికి చెందిన జక్కుల సుమలత అనే 35 ఏళ్ల మహిళ అదృశ్యమైంది. ఈ నెల 22న మంళవారం సుమలతతో పాటు ఆమె భర్త రాజు ఎస్‌బీఐలో పనిమీద గంభీరావుపేట వచ్చారు. అయితే బ్యాంక్ బుక్ వేరే బ్యాంక్‌ది తేవడంతో సుమలతను బ్యాంక్ వద్దే ఉండమని భర్త రాజు ఎస్‌బీఐ పాస్ బుక్ కోసం దేశాయిపేటకు వెళ్లి తిరిగి వచ్చాడు. రాజు వచ్చే సరికి సుమలత బ్యాంక్ వద్ద లేకపోవడంతో ఆందోళనల చెందాడు. చుట్టు పక్కల, బస్టాండ్ ప్రాంతంలో గ్రామం అంతా వెతికినా సుమలత జాడ తెలియలేదు. సుమలత ఆచూకీ కోసం వారి బంధువులు కూడా గాలిస్తున్నారు. ఆందోళనతో సుమలత భర్త రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వికసిత్ భారత్ సెమినార్ కరపత్రం ఆవిష్కరణ




కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం, అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ 2047 ఇండియా విజన్ ఫర్ డెవలప్‌మెంట్ అనే అంశంపై ఫిబ్రవరి 4, 5 తేదీల్లో 2025లో జరిగే రెండు రోజుల జాతీయ సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను వీసీ ఉమేష్ కుమార్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతదేశం 2047వ సంవత్సరం నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే స్థిరమైన అభివృద్ధి అవసరమని ఉద్బోదించారు. అభివృద్ధి, పారదర్శకత వికసిత్ భారత్ లక్ష్యాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్ వివరించారు. సెమినార్ డైరెక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతదేశం అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనేదే వికసిత్ భారత్ 2047 యొక్క ముఖ్య లక్ష్యం అని వివరించారు. కార్యక్రమంలో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ సూరేపల్లి సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాఫర్ జరీ, డాక్టర్ కే. పద్మావతి, డాక్టర్ అబ్రహం బాకీ, డాక్టర్ ఉమేరా బేగం, డాక్టర్ నజీముద్దీన్ మునావర్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో నురగ

- శాంపిల్స్ సేకరించిన కాలుష్య నియంత్రణ మండలి




గోదావరినదిలో నురగలతో నీటి ప్రవాహం

కోల్‌సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, గోదావరిఖని వద్ద గురువారం గోదావరి నదిలో నురగులు కనిపించాయి. దీంతో పరివాహక ప్రాంత ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మహారాష్ట్రలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శ్రీరాంసాగర్ ప్రవాహం పెరగడంతో గోదావరిలోకి నీటిని వదిలారు. దీంతో మహారాష్ట్రలోని లిక్కర్ పరిశ్రమల వ్యర్థాలు గోదావరినదిలో కలువడం వల్ల ఈ నురగలు వస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గోదావరిఖని గోదావరి తీరంలోని పుష్కర ఘాట్ వద్ద నీటి శాంపిల్స్ సేకరించారు. గోదావరి తీరం వెంట ఎస్సారెస్పీ దిగువన సెప్టెంబరులో గణపతి నిమజ్జనం జరిగింది. ఆ రసాయనాల వల్ల కూడా నురుగు వచ్చే అవకాశం ఉందని, ప్రవాహ వేగం పెరిగిన సమయంలోనే ఇలా జరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



శాంపిల్స్ సేకరిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు

వెదురుబొంగులతో.. మినియేచర్స్





- అగ్గిపెట్టెలో ఇమిడే బుట్టలు, వ్యవసాయ పనిముట్లు
- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న నర్సయ్య
- భూపతిపూర్‌వాసి ప్రతిభ

ప్రతి మనిషిలో ఏదో ఒక ప్రత్యేకత దాగి ఉంటుంది. తనలోని ప్రత్యేకతను గుర్తెరిగి దానికి పదును పెడితే అద్భుతాలు సృష్టించగలుగుతాడు. ఏ పని చేసినా, ఏవృత్తి చేపట్టినా సృజనాత్మకతతో కృషి చేస్తే అందరిలో ప్రత్యేకంగా నిలుస్తారు. తన శక్తి సామర్థ్యాలు పూర్తిగా వెచ్చించి కొత్త దనం కోసం కృషి చేసేవారు రికార్డులు సృష్టిస్తారు. రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన ఊరె నర్సయ్య అగ్గిపెట్టెలో ఇమిడే వెదురు బుట్టలు, చాట తయారీతో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు.

రాయికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన ఊరె నర్సయ్య తన కుల వృత్తి మ్యాదరి పని చేస్తూ ఖాళీ సమయంలో వెదురు బొంగులతో అద్భుత కళాకండాలను తయారు చేసి అబ్బు రపరుస్తున్నాడు. అతను అగ్గిపెట్టెలో ఇమిడే వెదురు కళాకృతులను బుట్టలు, చాటలు తయారు చేసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. వ్యవసాయ సాగు విధానం, వరి వేయడం, ఒడ్లు చెక్కడం, గుంతలు తీయడం, గుల్లలు అల్లడం వంటి కళాకృతులు తయారు చేస్తున్నాడు. వెదురు బొంగులతో సోఫాలు తయారు చేయడం, వివిధ రకాలు కళాకృతులు తయారు చేయడంతో వాటిని చూడడానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆయన ఇంటికి వస్తుంటారు. ఇటీవల వినాయక చవితి వేడుకల్లో నర్సయ్య తయారు చేసిన చెక్క గణపతి గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కొత్తగా ప్రయత్నం చేశా...: ఊరె నర్సయ్య

కుల వృత్తి మ్యాదరి పని చేసుకుంటూ జీవిస్తాను. వెదురు బొంగులతో అందరిలా కాకుండా ఏదైనా కొత్తగా ఆవిష్కరించాలని ప్రయత్నం చేస్తుంటా. సిరిసిల్ల జిల్లాలో అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేత కార్మికులు తయారు చేయడం తనకు స్ఫూర్తిని ఇచ్చింది. అందులో నుంచి పుట్టిన ఆలోచనతోనే అగ్గిపెట్టెలో ఇమిడే కళాకృతులు తయారు చేయాల ఆలోచన వచ్చింది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని నూతన ఆవిష్కరణలు చేస్తా.



న్యూస్ బాక్స్

బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ఇల్లంతకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీ మహాసభ అధ్యక్షుడిగా నియామకమైన కూనబోయిన బాలరాజును ముదిరాజ్ సంఘ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలను ఏకం చేసి విద్య, ఉద్యోగాలలో బీసీలకు సమన్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకపోవాలని సూచించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు గొడుగు నర్సయ్య, గౌరవ అధ్యక్షుడు కంకటి ప్రభాకర్, నాయకులు తూటి పర్శరాం, తునికి ఆనంద్, రమేష్, దేవయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నిరుపేద యువతకు ఉపాధి అందించేందుకు కృషి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నిరుపేద యువతకు స్వయం ఉపాధి అందించేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కృషి చేస్తామని అధ్యక్షుడు కోట సతీష్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సతీష్‌కుమార్ తన సొంత ఖర్చులతో 70 వేల రూపాయల విలువైన కుట్టు మిషన్లు, సైకిళ్లు, స్పేయర్ డబ్బాలు, ట్రై సైకిల్‌ను గురువారం అందజేశారు. గ్రామాల్లో నిరుపేదలను ఆదుకోవడం కోసం తమ వంతు సాయం చేస్తామన్నారు. అనంతరం ఇటీవల డీఎస్సీలో ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు భాస్కర్‌రెడ్డి, లింగారెడ్డి, రామచంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శంకర్, మహాదేవ్, మల్లారెడ్డి, దేవయ్య, మల్లేశ్, రవి, అమరేందర్ రెడ్డి, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

మైనింగ్ ఏడీ విచారణ

బోయినపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాపై మైనింగ్ ఏడీ గురువారం విచారణ జరిపారు. 'అనుమతుల పేరట ఇసుక అక్రమ రవాణా' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం అయింది. స్పందించిన మైనింగ్ ఏడీ క్రాంతికుమార్ విచారణ నిర్వహించారు. ఇసుక రవాణాకు ముందస్తు అనుమతి, మిడ్ మానేరు ప్రాజెక్టు కింద ఇసుక తవ్వకాలపై నివేదికను కలెక్టర్ అందజేస్తామని ఆయన తెలిపారు.

అమరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- ఎస్పీ అఖిల్ మహాజన్
- ఆయుధాల వినియోగంపై అవగాహన




పోలీస్ బెటాలియన్‌లో విద్యార్థులకు ఆయుధాలపై అవగహన కల్పిస్తున్న పోలీసులు, వేములవాడలో..

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అమరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో (ఫ్లాగ్‌డే) భాగంగా సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం విద్యార్థులకు ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఓపెన్ హౌజ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రేయిన్‌బో, శుభోదయ, సరస్వతి విద్యాలయాల విద్యార్థులకు పోలీసు చట్టాలు, కేసుల ఛేదన, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఉపయోగాలు, డాగ్, బాంబ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ పరికరాలు, నిబంధనలు, షీటీం, భరోసా సెంటర్, సైబర్ నేరాలు, ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం, డయల్ 100, రిసెప్షన్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలకు పోలీస్‌స్టేషన్ ఎలా ఉపయోగపడుతుందని, పోలీసు విధు లు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యతో పాటు అన్నింటిలో అవగాహన కలిగి ఉన్నపుడే సమాజంలో రాణిస్తారన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించా మన్నారు. ఇటువంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాలుపంచుకొని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏ ఆయుధం ఎలా ఉపయోగపడుతుందని విద్యార్థులకు ప్రదర్శనగా చూపెట్టారు. కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ కె. కృష్ణ, ఆర్‌ఐలు యాదగిరి, రమేశ్, మధుకర్, ఆర్ఎస్ఐ సాయికిరణ్ పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్ (ఆంధ్రజ్యోతి): పోలీసులు వినియోగించే ఆయుధాలపై విద్యార్థులకు 17వ పోలీస్ బెటాలియన్‌లో అవగాహన కల్పించారు. పోలీస్ అమర వీరుల వారోత్సవాలల్లో భాగంగా సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో గురువారం పెద్దూర్, సర్దాపూర్ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వివిధ రకాల ఆయుధాలు, ఆయుధ పరికరాలు, కమ్యూనికేషన్ పరికరాలు వాటి పనితీరుపై కమాండెంట్ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ సాంబ శివరావు, ఉదయ్‌భాస్కర్ అధికారులు పాల్గొన్నారు.

వేములవాడ (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజం పట్ల, చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం ఓపెన్‌హౌజ్ కార్యక్రమం జరిగింది. పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

వీర్నపల్లి (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల పోలీస్ స్టేషన్‌లో ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎల్లాగౌడ్ విద్యార్థులకు స్టేషన్‌లోని ఆయుధాలపై అవగాహన కల్పించారు.

కోనరావుపేట (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట పోలీస్ స్టేషన్లో ఎస్సై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఆయుధాలపై ఆయన కల్పించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలు భాగంగా విద్యార్థులకు పోలీస్‌స్టేషన్లో ఉన్న ఆయుధాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చందుర్తి (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు విధులు, ఎఫ్ఐఆర్ నమోదు, ఆయుధాల వినియోగం తదితర వాటిపై విద్యార్థులకు ఏఎస్ఐ బాబు అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో విధులు, రిసెప్షన్‌లో సిబ్బంది విధులు, కంప్యూటర్ గది, లాకప్ గదిని విద్యార్థులకు చూపించారు.

కోతి పిల్లకు చికిత్స

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రమాదానికి గురైన కోతి పిల్లకు ఆలయ ఈవో వినోద్ రెడ్డి చికిత్స చేయించాడు. రాజన్న ఆలయ ప్రాంగణంలో నడవలేని స్థితిలో కోతి పిల్ల కనిపించడంతో గోశాలలో విధులు నిర్వర్తించే వెటర్నరీ డాక్టర్‌తో చికిత్స చేయించారు.



కోతికి చికిత్స చేయిస్తున్న ఆలయ ఈవో

కులగణనతో బీసీలకు న్యాయం



ఏఎంసీ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

గంభీరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టడం చారిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. గంభీరావుపేట మండలం రాజుపేటలో ఏఎంసీ డైరెక్టర్ అల్లె రాజుకు గ్రామస్థులు గురువారం సన్మాన సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి పర్శ హన్మండ్లు మాట్లాడారు. రాష్ట్రంలో సమగ్ర కుల గణన తో బీసీలకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సామాజిక న్యాయం దక్కుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగాలేకున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మెజారిటీ రైతుల రుణమాఫీ చేసిందని మిగితా రైతులకు కూడ రుణమాఫీకి ఏర్పాట్లు చేయడం గొప్ప విషయమ న్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రం, నారాయణ, లక్ష్మణ్, రాజయ్య, బాలరాజు, సత్యం, స్వామి, బాలమల్లు, రమేష్, లింగం, కనకయ్య, భరత్, భూపతి, దేవయ్య, మధు, నవీన్ తదితరులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్‌లో వేగం పెరిగేనా?

5వ పేజీ తరువాయి..

దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 11,187 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 1,169 దరఖాస్తులు పరిష్కరించారు. ఒక్కో ప్లాట్‌కు గత మార్కెట్ ధరలకు అనుగుణంగా కనీసం 20 వేల రూపాయల నుంచి 50 వేల రూపాయల వరకు ఆదాయం లభిస్తుంది. దీని ప్రకారం కనీసం వంద కోట్ల రూపాయలకు పైగా ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. జిల్లాలో ప్రభు త్వం సూచించిన నిబంధనల ప్రకారం వచ్చిన దరఖాస్తు ల్లో సిరిసిల్ల మున్సిపాల్టీలో 10,493 దరఖాస్తులు, వేము లవాడ మున్సిపాల్టీలో 16,336 దరఖాస్తులు వచ్చాయి. గ్రామపంచాయతీల్లో వచ్చిన దరఖాస్తుల్లో బోయినపల్లి మండలంలో 645 దరఖాస్తులు, చందుర్తిలో 213 దరఖాస్తులు, ఇల్లంతకుంటలో 1,054 దరఖాస్తులు, గంభీ రావుపేటలో 861 దరఖాస్తులు, కోనరావుపేటలో 277 దరఖాస్తులు, వేములవాడ అర్బన్ మండలంలో 3,702 దరఖాస్తులు, ముస్తాబాద్ మండలంలో 1074 దరఖాస్తులు, ఎల్లారెడ్డిపేట మండలంలో 3,949 దరఖాస్తులు, తంగళ్లపల్లిలో 3,784 దరఖాస్తులు, వేములవాడ రూరల్ మండలంలో 214 దరఖాస్తులు, రుద్రంగిలో 304 దరఖాస్తులు, వీర్నపల్లి మండలంలో 71 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల పరిశీలనకు క్లస్టర్‌లుగా విభజించి వెయ్యి దరఖాస్తులకు ఒక బృందాన్ని ఏర్పాటు చేయడంతో దరఖాస్తుల పరిశీలన వేగంగా జరుగుతోంది. దరఖాస్తుల పరిశీలన వేగం పెంచడంతో ప్లాట్ల కొనుగోలుదారుల్లో ఊరట లభిస్తుంది. జిల్లాలో ఎలాంటి లే అవుట్‌లు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి అనుమతులు ఇవ్వకపోవడం, కఠినంగా వ్యవహరిస్తున్న క్రమంలో ప్లాట్ల కొనుగోలుదారులు గత ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం అక్రమ లే అవుట్లు, స్థలాల క్రమబద్ధీకరణకు 2015 నుంచి వివిధ దశల్లో లే అవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించింది. అప్పుడు వచ్చిన దరఖాస్తులను రెండేళ్ల పాటు పరిశీలించి క్రమబద్ధీకరించారు. మళ్లీ 2020 ఆగస్టులో ఎల్ఆర్ఎస్ పథకాన్ని తెచ్చింది. లే అవుట్ క్రమబద్ధీకరణలో దరఖాస్తులు ఆహ్వానించారు. ప్లాట్లకు సంబంధించి వెయ్యి రూపాయల చొప్పున, లే అవుట్ క్రమబద్ధీకరణకు 10 వేల రూపాయల చొప్పున చెల్లించి దరఖాస్తులను స్వీకరించారు. ఈ విషయంలో కొందరు కోర్టుకు వెళ్లడంతో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ నిలిచిపోయింది. ప్రభుత్వం కొంత ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకన్నా వారికి భవన నిర్మాణ అనుమతుల్లో కొంత వెసులుబాటు కల్పించినా క్రమబద్ధీకరణ జరగలేదు. ప్రస్తుతం భూమి విలువను బట్టి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి...

జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనపై జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక దృష్టి పెట్టారు. మూడు రోజుల క్రితం జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, గ్రామీణ ప్రాంతాల్లోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన చర్యలపై పలు ఆదేశాలు జారీ చేశారు. నాలుగు దశల్లో ప్రక్రియ పూర్తి చేయాలని దరఖాస్తులను సర్వే నంబర్ల వారీగా రెవెన్యూ, గ్రామం, మున్సిపాలిటీల్లో బృందాలుగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసే విధంగా సూచనలు చేశారు. నీటి వనరుల బఫర్ జోన్, నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్, డిఫెన్స్ ల్యాండ్ వంటివి పరిశీలించి దరఖాస్తులను క్లియర్ చేసే విధంగా సూచనలు చేశారు.

స్వచ్ఛతవైపు అడుగులు..

5వ పేజీ తరువాయి..

ఆంధ్రజ్యోతి : కుక్కలు, కోతుల బెడద నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్ : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో కుక్కల జనాభా పెరుగుదల లేకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తాము. ఇందుకు ప్రత్యేక ఏజెన్సీకి అప్పగించాం. కోతుల బెడద నివారణకు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చాము.

ఆంధ్రజ్యోతి : మున్సిపల్ నిధుల పరిస్థితి ఏమిటి?

కమిషనర్ : సిరిసిల్ల మున్సిపాలిటీకి పన్నుల రూపంలో వస్తున్న నిధులు జీతాలు, ఇతర నిర్వాహణకు సరిపోతుంది. గతంలో చేసిన అభివృద్ధి పార్కులు, బైపాస్ రోడ్డులు, ఇతర వాటి నిర్వాహణకు కొంత భారంగా ఉంది. పారిశుధ్యానికి సంబంధించి 40 వాహనాలకు డీజిల్ ఇతర ఖర్చులకు కూడా ఇబ్బందిగానే ఉంది. అభివృద్ధి పనులకు సంబంధించి రూ 2.50కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి : మున్సిపాలిటీలో సిబ్బంది కొరత ఉందా?

కమిషనర్ : సిరిసిల్ల మున్సిపాలిటీలో సిబ్బంది కొరత లేదు. 375 మంది పనిచేస్తున్నారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో జనాభాకు అనుగుణంగా సిబ్బంది ఉన్నారు. కానీ ఏడు గ్రామాల విలీనంతో విస్తీర్ణం పెరగడంతో సకాలంలో ప్రజలకు సేవలు అందించలేకపోతున్నాము.

హమాలీల సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారిని ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పంతం రవి కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి హమాలీల సమస్యలను పరిష్కరించాలంటూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐకేపీ, సింగిల్ విండో సొసైటీల్లో సుమారు 5వేల మంది హమాలీ కార్మికులు పనిచేస్తూ వారి కుటంబాలను పోషించుకుంటున్నారన్నారు. కానీ వారికి మార్కెట్‌లో పెరిగిన నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడం ఫలితంగా కనీసం వారి కుటుంబాలకు రెండుపూటల తిండి కూడా పెట్టలేని దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే హమాలీ కార్మికుల కూలీ పెంచాలని డిమాండ్ చేశారు. హమాలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకుంటే తిహమాలి కార్మికులను కలుపుకొని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సోమ నాగరాజు, హమాలి కార్మిక సంఘం నాయకులు బచ్చుపల్లి శంకర్, బర్ల శ్రీనివాస్, బట్టు మల్లయ్య, కోట శంకర్, బర్ల రాజయ్య పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను అరికట్టాలి

కోనరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో బెల్ట్ షాపులను ప్రభుత్వం అరికట్టాలని ఐద్వా మండల అధ్యక్షురా లు విమల డిమాండ్ చేశారు. కోనరావుపేట మండల కేంద్రంలో మహిళల సమస్యలను తెలుసుకొని గురువారం మాట్లాడారు. మహిళలకు పావుల వడ్డీ రుణాన్ని అందించాలని అన్నారు. తీసుకున్న లోన్లకు పావలా వడ్డీ తిరిగి ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు ఉండడం వల్ల తాగుడుకు బానిసలై కుటుంబాలు పాడవుతున్నాయని అన్నారు. అందుకే గ్రామంలో బెల్ట్ షాపుల ను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్న మహిళ



మహిళతో మాట్లాడుతున్న నాయకులు

చందుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను గ్రామానికి చెందిన మహిళ గురువారం రెండో రోజు కూడా అడ్డుకుంది. పాఠశాలకు వెళ్లే రోడ్డు మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో విద్యార్థులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణంతో తమ భూమి పోతుందని గ్రామానికి చెందిన బీరయ్య ఐలవ్వ అనే దంపతులు ట్రాక్టర్‌ను వెళ్లకుండా రోడ్డుపై అడ్డుకున్నారు. దీంతో భూసమస్య పరిష్కారానికి కృషి చేస్తామని గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు హామీ ఇవ్వడంతో సదరు మహిళ రోడ్డు నిర్మాణ పనులు జరిగేందుకు సహకరించడంతో సమస్య సద్దుమనిగింది.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

బోయినపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కాలే నారాయణరెడ్డిని మండల నాయకులు గురువారం కలిసారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, నాయకులు జంగం అంజయ్య, సంభ లక్ష్మీరాజం, తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

చందుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి చెందిన వాసం ప్రసాద్ అనే నిరుపేద ఆటో డ్రైవర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి గ్రామస్థులు 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం గురువారం అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ కుసుంబ జనార్దన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన తోటి స్నేహితులను గ్రామస్థులు అభినందించారు.

మల్లారెడ్డిపేటలో దొంగల బీభత్సం

గంభీరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)తి: మండలంలోని మల్లారెడ్డిపేటలో బుధవారం దొంగలు బీభత్సం సృష్టించారు. ఏకంగా నాలుగు ఇళ్ల తాళాలను దొంగలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. లక్ష్మి అనే మహిళ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి అర తులం బంగారు చైన్, 15 తులాల వెండి పట్టగొలుసులను అపహరించారు. మల్లారెడ్డి ఇంటి తాళాలు దొంగలు పగుల గొట్టారు. కాకపోతే మల్లారెడ్డి ఇంట్లో ఏమి పోలేదు. అదే విధంగా మరో ఇద్దరి ఇళ్ల తాళాలు దొంగలు పగుల గొట్టి చోరీకి పాల్పడ్డారని గ్రామస్థులు తెలిపారు. ఈ రెండు ఇళ్లల్లో ఎంత లూటీ జరిగిన వివరాలు ఇంకా తెలియలేదు. మరో ఇంటి తాళాలను దొంగలు పగుల గొట్టారని తెలిసింది.

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్..

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తూ వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. మండల కేంద్రంలో ఇటీవల పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. అంతకు ముందు కేజీ టూ పీజీ సమీపాన దొంగలు తాళం వేసిన ఇళ్లనును టార్గెట్ చేసి, పెద్దఎత్తున బంగారాన్ని ఎత్తుకెళ్లారు. తాజాగా ముస్తాఫనగర్‌లో కూడా ఓ తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. వారి ఇంటి ఎదుట ఉన్న కారును దొంగలు ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. ఇప్పుడు మల్లారెడ్డిపేటలో దొంగలు నానా బీభత్సం సృష్టించారు.

పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి

- 7వ రోజుకు చేరుకున్న మాజీ సర్పంచ్‌ల రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహాదీక్షలో కూర్చున్న మాజీ సర్పంచులు

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని తాజా మాజీ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు సక్కినపల్లి కరుణాకర్, దుమ్మ అంజయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలోని తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారంతో ఏడో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాలకు చెందిన మాజీ సర్పంచులు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ దీక్షకు గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ సుతారి సంపూర్ణ, నాయీబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి శ్రీనివాస్ సంఘీబావం ప్రకటించారు. దీక్షలో జేఏసీ ఉపాధ్యక్షుడు గనప శివజ్యోతి, కార్యదర్శులు గున్నాల లక్ష్మణ్, సిరికొండ శ్రీనివాస్, దోమకొండ ఎల్లం, రవినాయక్, పడిగెల రవీందర్, కోల నర్సయ్య, గాండ్ల సుమతి, చిటినేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్న యెల్ల బాల్‌రెడ్డి తదితరులు

ముస్తాబాద్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రూ 15 లక్షల విలువ చేసే 28 మంది లబ్ధిదారులకు చెక్కులను గురువారం అందించారు. ఈ సందర్భంగా యెల్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు కార్పోరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సింలు, వైస్ చైర్మన్ రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మట్ట రమణారెడ్డి, గాంత రాజు, దీకొండ దశరథం, శ్రీనివాస్, అంజనేయులు, రంజాని నరేశ్, సద్ది మధు, కనమేని శ్రీనివాస్‌రెడ్డి, ఏదునూరి భానుచందర్, ప్రతాపరెడ్డి, దేవేందర్, ఉచ్చిడి బాల్‌రెడ్డి, మిరుదొడ్డి భాను, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్ అన్నారు. గురువారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, చిన్న లింగాపూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మంది పేదలకు నాణ్యమైన వైద్యమందించి ఆదుకుంటున్నట్లు తెలిపారు. అభాగ్యులకు అండగా ఆర్థిక భరోసాగా సీఎం రిలీఫ్‌ఫండ్ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ నేరళ్ళ నర్సింగం గౌడ్, డైరెక్టర్లు, గ్రామ శాఖా అధ్యక్షులు ,మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లోని లబ్ధిదారురాలు వజ్రమ్మకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్థానిక నాయకులు గురువారం అందజేశారు. పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బాలయ్య, నాయకులు రాజయ్య, ఎల్లయ్య, నాగరాజు, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిది కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా అన్నారు. మండలం లోని గోవిందరావుపేటలో గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా భూక్య సాయికుమార్‌కు రూ. 23500 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో భూక్య తిరుపతి నాయక్, భూక్య మదన్, శ్రీనివాస్, గుగ్లోత్ చెత్రు నాయక్, బాన్సీలాల్, తిరుపతి పాల్గొన్నారు.

చందుర్తి, (రుద్రంగి): రుద్రంగి మండలం మానాల గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద ప్రజల పార్టీని, రైతు పక్షపాత ప్రభుత్వం అని అన్నారు. ఇద్దరు లబ్ధిదారులకు 89 వేల రూపాయల చెక్కులను అందించామన్నారు. కార్యక్రమంలో నాయకులు జక్కు మోహన్, తూం జలపతి, కొమ్ము రవీందర్ రెడ్డి, జక్కు వంశీ, లక్కాకుల రమేష్, లక్ష్మీనారాయణ, జక్కు లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ చేపడుతున్న పనులు భేష్

- సిద్దిపేటలో పర్యటించిన 11 మున్సిపాలిటీల కమిషనర్లు



పొడి చెత్త విధానం గురించి వివరిస్తున్న సిబ్బంది

సిద్దిపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ పరిధిలో జరిగిన అభివృద్ధి సూపర్ అంటూ, ఇక్కడికి వచ్చి చాలా విషయాలు నేర్చుకున్నామని రాష్ట్రంలోని 11 మున్సిపాలిటీలకు చెందిన కమిషనర్లు, అధికారులు, సిబ్బంది స్పష్టం చేశారు. గురువారం సిద్దిపేట పట్టణంలో రాష్ట్రంలోని జనగామ, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, నర్సంపేట, వర్ధన్నపేట, సిరిసిల్ల, ఆర్మూర్, భీంగల్, బోధన్‌లకు చెందిన కమిషనర్లు, అధికారులు సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం, అధికారులు చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వారికి సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ చేపట్టిన, చేపడుతున్న పనులను వివరించారు. ప్రతిరోజు ఇంటి నుంచి వెలువడిన చెత్తను ఏ రకంగా తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి ఇస్తున్నారో వారు పరిశీలించారు. బుస్సాపూర్‌లో ఏర్పాటు చేసిన గృహ వ్యర్థాల నుంచి సీఎన్‌జీ ఉత్పత్తి చేసే బయో గ్యాస్ ప్లాంట్‌ను సందర్శించారు. చెత్త సమస్య పరిష్కారానికి బుస్సాపూర్ రిసోర్స్ పార్కులో చెత్తశుద్ధికి ఇప్పటికే బయోమైనింగ్ ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించారు. హౌసింగ్ బోర్డు వద్దనున్న పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని (డీఆర్‌సీసీ)ను సందర్శించారు.